
సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 26 । మార్చి । 2023



సస్పెన్షన్ వేటు

యాదాద్రి ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణశర్మపై ఈఓ గీతారెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. - 8లో



రైతులకు తీరనున్న ఇబ్బందులు

భువనగిరిలో రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే అందుబాటులోకి రానుంది. - 9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35°/23°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (ఆదివారం సాయంత్రం)

సహర్ 4-53 (సోమవారం ఉదయం)

నిర్వాసితులను పట్టించుకోరా!



లప్పానాయక్ తండావాసుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై జెడ్పీ చైర్మన్‌ను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ సభ్యులు



సమావేశం నుంచి వెళ్లిపోతున్న జెడ్పీటీసీ నగేష్

పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇంకెప్పుడిస్తరు

- అధికార పక్షాన్ని నిలదీసిన కాంగ్రెస్ సభ్యులు
- బునాదిగాని కాల్వలో గోదావరి జలాలు కలిపే విషయంపైనా చర్చ
- రోడ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు
- పోడియం ముందు బైఠాయించిన ఆలేరు జెడ్పీటీసీ.. సభ నుంచి వాకౌట్

సాక్షి, యాదాద్రి : లప్పానాయక్‌తండా నిర్వాసితుల సమస్యపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రధానంగా ప్రస్తావించారు. ప్రాజెక్టు పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకపోగా పునరావాసం కూడా కల్పించడం లేదంటూ అధికార పక్షంపై కాంగ్రెస్ సభ్యులు ధ్వజమెత్తారు. నిర్వాసితులంటే ఏమాత్రం పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. చైర్మన్ తీరుకు నిరసనగా ఆలేరు జెడ్పీటీసీ, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ కుడుదుల నగేష్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

సభ ఇలా సాగింది

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు -16 ప్యాకేజీలో భువనగిరి మండలం వీరవెల్లి దగ్గర బస్వాపురం కాల్వ ద్వారా వచ్చే గోదావరి జలాలను బునాదిగాని కాల్వలో కలిపి అడ్డగూడూరు వరకు తరలించే విషయంలో స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ అధికారులను కోరారు. ఈ విషయంలో జెడ్పీ చైర్మన్, నగేష్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాధానం చెప్పకుండా మరో అంశానికి చైర్మన్ అనుమతి ఇవ్వడంతో జెడ్పీటీసీ సభ్యుడు నగేష్ సభ నుంచి వాకౌట్ చేశారు.

రోడ్ల నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు పూర్తి కాకపోవడంపై సమావేశం మొత్తం ఆగ్రహం వ్యక్తం చేసింది. వడపర్తి - చీకటిమామిడి రోడ్డు వేసిన రెండు నెలలకే గుంతలు పడిందని చెప్పినా ఎందుకు పూడ్చలేదని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి ఈఈ శంకరయ్యను ప్రశ్నించారు. చౌటుప్పల్ - సంగెం, సంగెం - బొల్లేపల్లి రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఆలేరులో ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ ఎత్తివేసే కుట్ర జరుగుతుందని, మంతపురి మీదుగా అమ్మనబోలు వరకు రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తప్పుడు నివేదిక ఇచ్చారని జెడ్పీటీసీ డాక్టర్ నగేష్ ఆరోపించారు. రామన్నపేట - ఎన్నారం రోడ్డు పనులతో చాలా పనులు ఎందుకు ప్రారంభించలేదన్నారు. రాయగిరి -మోత్కూరు రోడ్డు సంవత్సరాలుగా అసంపూర్తిగా వదిలేశారని మోటకొండూరు ఎంపీపీ పైళ్ల ఇందిర అధికారులను ప్రశ్నించారు. పంచాయతీరాజ్ వేసిన సీసీ రోడ్ల మీదే మళ్లీ రోడ్లు వేస్తున్నారని భువనగిరి, వలిగొండ ఎంపీపీలు నరాల నిర్మల, నూతి రమేష్ ఫిర్యాదు చేశారు. అధికారుల పని తీరు బాగోలేదని భువనగిరి ఎంపీపీ ఆరోపించారు. కాగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకురావడం లేదన్నారు. క్రషర్ మిల్లులు దూరంగా ఉండడం వల్ల పనులు కావడం లేదని ఈఈ చెప్పారు. పనులు చేయని కాంట్రాక్టర్ల టెండర్లు రద్దు చేయాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్ తివారీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు భానుమతి, శారద, ప్రణీత, జ్యోతి, లక్ష్మి, అనురాధ, మండల పరిషత్ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు, రైతుబంధుపై..

సంస్థాన్‌నారాయణపురంలో చేపట్టిన 52 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ఎంపీపీ గుత్త ఉమాదేవి అధికారులను కోరారు. రైతుబంధు ఆర్థిక సహాయం తమకు అందలేదని గ్రామాల్లో రైతులు అడుగుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను సభలో ఏకరువుపెట్టారు

పరిహారంపై వాడీవేడిగా చర్చ

బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపు గ్రామమైన లప్పానాయక్‌తండావాసులకు పరిహారం, ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో సభలో వాడీవేడిగా చర్చ సాగింది. పరిహారం ఎందుకు ఇవ్వడం లేదన్న విషయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సభ్యులు కింద బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ జోక్యం చేసుకొని మే నెలలో డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు, ఇల్లు వాకిలి కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వడమేమిటని నగేష్ కాళేశ్వరం ఈఈ ఖుర్షీద్‌ను ప్రశ్నించారు.నిబంధనల ప్రకారమే చెల్లిస్తున్నామని ఈఈ సమాధానం ఇచ్చారు.

• నిరసన హోరు



రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శనివారం భువనగిరిలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పనులను పరిశీలించి.. సూచనలు చేసి

- భువనగిరిలోని 31, 32 వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి



మీనానగర్‌లో రాత్రి సమయంలో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 31, 32వ వార్డుల్లోని బంజరాహిల్స్, తారకరామానగర్‌లో శనివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పర్యటించారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పరిశీలించారు. అదే విధంగా మీనానగర్ ఏరియాలో జరుగుతున్న డ్రెయినేజీ పనులను రాత్రి సమయంలో ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తీశారు. పనులు నాణ్యవంతంగా ఉండాలని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, నాయకులు పెంట నర్సింహా, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆలేరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల గొడవ

- అనర్హులను ఎంపిక చేశారంటూ దరఖాస్తుదారుల ఆందోళన
- తహసీల్దార్‌తో వాగ్వాదం



తహసీల్దార్‌తో గొడవకు దిగిన దరఖాస్తుదారులు

ఆలేరురూరల్ : పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకోసం దరఖాస్తుదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిరుపేదలకు కాకుండా అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. వివరాలిలా.. పట్టణంలో 64 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించగా 513 మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం 103 మందిని ఎంపిక చేశారు. శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సభలో తహసీల్దార్ రామకృష్ణ లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. ఇళ్లు రానివారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి జాబితా తయారు చేశారని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇళ్లు కేటాయించారని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇళ్ల పంపిణీ రసాభాసగా మారింది. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు అనంతరం డ్రా తీసి ఇళ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బేతి రాములు, కందుల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, చెక్క వెంకటేష్, బందెల సుభాష్, ఎండీ ఎక్బాల్, పత్తి వెంకటేష్, ముదిగొండ శ్రీకాంత్, ఎస్‌కే మహమూద్, టింకు, భరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సంతృప్తితో ఉన్నా..

- పేద వర్గాల అభ్యున్నతికి సహకారం అందించాను
- 90 కమ్యూనిటీ భవనాలకు నిధులిచ్చాను
- సన్మాన సభలో ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి



ఎమ్మెల్సీ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, సీఈఓ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్సీగా ఆరు సంవత్సరాల పదవీకాలంలో పేద వర్గాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించి సంతృప్తితో ఉన్నానని ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి అన్నారు. నాలుగు రోజుల్లో ఎమ్మెల్సీ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 మార్చి 21న మండలి శాసన సభ్యుడిగా పదవీ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా బడుగు, బలహీనవర్గాల ప్రయోజనం కోసం ఎమ్మెల్సీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు 50 ఏళ్ల పాటు ఉపయోగపడే విధంగా 90 కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశానని చెప్పారు. భూదాన్‌పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ భవనం తనకు తృప్తినిచ్చిందన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి ప్రజలకు సేవ చేయాలని కోరారు. తన పదవీకాలంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 8 మంది ఏకగ్రీవం

భువనగిరి : భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ శనివారం ముగిసింది. ఎనిమిది మంది ఏకగ్రీవం అయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికోసం నిసంగి విద్యాసాగర్, నాగారం అంజయ్య, బబ్బూరి హరినాథ్, పడాల శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవి కోసం కుక్కదువ్వ సోమయ్య, కలకుంట్ల జయ పోటీ పడుతున్నారు. కాగా జనరల్ సెక్రటరీగా సీహెచ్. రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కాటేపల్లి మల్లేశం, కోశాధికారిగా చేగూరి అయిలయ్య, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీగా ఆకుల మల్లేశం, లైబ్రరీ సెక్రటరీగా డాక్టర్ బొల్లేపల్లి కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కడమంచి రాంబాబు, తుమ్మేటి యాదయ్య, పల్లెర్ల నరహరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నాయికం రమేష్ తెలిపారు. కాగా అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం ఈ నెల 31న ఎన్నిక జరుగనున్నట్లు చెప్పారు.

వడగండ్లు, ఈదురు గాలులు



చౌటుప్పల్ : నేలరాలిన మామిడి కాయలు



చౌటుప్పల్ : కురిసిన వడగండ్లు

చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం : చౌటుప్పల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో పాటు వడగండ్ల వర్షం కురిసింది. అల్లాపురం, పీపల్‌పహాడ్, దేవలమ్మనాగారం, కొయ్యలగూడెం, దండుమల్కాపురం, తూప్రాన్‌పేట, ఖైతాపురం తదితర గ్రామాల్లో వరి చేలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. అదే విధంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని తుంబాయితండాలో ఈదురుగాలులకు నోముల జంగయ్య, కాట్రోత్ దేవికి చెందిన ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రగతికి ప్రోత్సాహం

జిల్లా స్థాయి పురస్కారాలకు 27 పంచాయతీలు

- తొమ్మిది అంశాలు పరిగణనలోకి
- నేడు నల్లగొండలో అవార్డులు అందుకోనున్న సర్పంచ్‌లు
- జాతీయ స్థాయికి వెల్లంకి నామినేట్



చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు

రామన్నపేట,చౌటుప్పల్,గుండాల : పల్లెలు మురిశాయి. పారిశుద్యం, స్వచ్ఛత, అభివృద్ధి, పచ్చదనం, సామాజిక భద్రత ఇలా.. తొమ్మిది అంశాల్లో వరించిన అవార్డులతో మెరిశాయి. జాతీయ స్థాయిలో కేంద్ర పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 2021 -22 సంవత్సరానికి గాను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీలకు ప్రభుత్వం పురస్కారాలు ప్రదానం చేస్తుంది. మండలస్థాయిలో పూర్తి కాగా జిల్లా స్థాయిలో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. యాదాద్రి జిల్లాలో 420 గ్రామ పంచాయతీలకు గాను 27 పంచాయతీలు అవార్డుకు ఎంపికయ్యాయి.

జాతీయ స్థాయికి నామినేట్ అయిన వెల్లంకి



వెల్లంకిలో సర్పంచ్ తన సొంత నిధులతో నిర్మించిన మోడల్ పంచాయతీ భవనం

సమగ్రమైన స్వయం సమృద్ధి విభాగంలో జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైన రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయి అవార్డుకు కూడా ఎంపికైంది. ఈనెల 30న హైదరాబాద్‌లో అవార్డును ప్రదానం చేయనున్నారు. యాదాద్రి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన వెల్లంకి జాతీయస్థాయి అవార్డుకు నామినేట్ అయింది. రాష్ట్రం నుంచి 27 గ్రామ పంచాయతీలను జాతీయస్థాయి అవార్డుకు నామినేట్ చేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 24న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ కె.నర్సింహులు వెల్లంకిని సందర్శించి అవార్డుకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అవార్డులకు ఎంపికైన గ్రామ పంచాయతీలు

పేదరిక నిర్మూలన జీవనోపాధి విభాగంలో మల్కాపురం(చౌటుప్పల్), కొలనుపాక (ఆలేరు), బీబీనగర్, ఆరోగ్య పంచాయతీలో ఇక్కుర్తి(మోటకొండూరు), మంతపురి(ఆలేరు), వాసాలమర్రి (తుర్కపల్లి), బాలల స్నేహపూర్వక విభాగంలో ఇంద్రపాలనగరం(రామన్నపేట), పహిల్వాన్‌పురం (వలిగొండ), మీట్‌తండా (బీబీనగర్), సరిపడా భూగర్భజల వనరుల విభాగంలో సమాత్‌పల్లి (భువనగిరి), ఎస్.లింగోటం(చౌటుప్పల్), గంగాపూర్ (గుండాల), పరిశుభ్రత పచ్చదనంలో ఎస్.లింగోటం(చౌటుప్పల్), జలాల్‌పూర్ (పోచంపల్లి), వడాయిగూడెం (భువనగిరి), సమగ్రమైన స్వయం సమృద్ధి విభాగంలో వెల్లంకి (రామన్నపేట), రేణికుంట (రాజాపేట), సంగెం(వలిగొండ), సామాజికభద్రతలో అన్నంపట్ల(బీబీనగర్), దిలావర్‌పూర్ (మోటకొండూరు), జాల(రాజపేట), సుపరిపాలనలో తాజ్‌పూర్(భువనగిరి), సాయినగర్ (పోచంపల్లి), రామలింగంపల్లి (బొమ్మలరామారం) ఎంపికయ్యాయి. మహిళల ఫ్రెండ్లీ విభాగంలో శివారెడ్డిగూడెం(పోచంపల్లి), రాఘవపురం (బీబీనగర్), మాదాపూర్ (తుర్కపల్లి) ఉన్నాయి.

హర్షణీయం



పల్లెప్రగతిని విజయవంతంగా నిర్వహించాం. మోడల్ పంచాయతీ భవనం, రైతు వేదికలను నిర్మించుకున్నాం. పారిశుద్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు మల్టీపర్పస్ సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో సీసీ రోడ్లు, నూరు శాతం డ్రెయినేజీలు నిర్మించుకున్నాం. వెల్లంకి జాతీయస్థాయి పురస్కారానికి నామినేట్ కావడం హర్షణీయం. ఈ గౌరవం నాతోపాటు గ్రామస్తులందరికీ వర్తిస్తుంది. -ఎడ్ల మహేందర్‌రెడ్డి, సర్పంచ్, వెల్లంకి

మరింతగా శ్రమిస్తాం



తమ గ్రామానికి జిల్లా ఉత్తమ పంచాయితీ అవార్డు లభించడం ఆనందదాయకం. అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశాం. ఇదే స్ఫూర్తితో గ్రామాభివృద్ధి కోసం మరింతగా శ్రమిస్తాం. పాలకవర్గం, అధికార యంత్రాంగం, గ్రామస్తుల సహకారంతో ఈ ఘనత సాధించాం. రానున్న రోజుల్లో మరిన్ని విభాగాల్లో అవార్డులు దక్కించుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తాం. - ఎలువర్తి యాదగిరి, సర్పంచ్, దండుమల్కాపురం

అందరి సహకారంతో ఘనత



గ్రామంలో వైకుంఠధామం, పీర్లకొట్టం, క్రీడా ప్రాంగణం, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాం. డంపింగ్ యార్డులో స్వయంగా కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నాం. ఇంటి పన్ను వంద శాతం వసూలు చేశాం. పల్లె ప్రకృతి వనంలో పలు రకాల పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నాం. అందరి సహకారంతో మా పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. - దార సైదులు, సర్పంచ్, గంగాపురం

సంతోషంగా ఉంది



ఎమ్మెల్యే ప్రోత్సాహం, ముత్యాలమ్మ తల్లి దీవెనలతో గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేశాం. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, పాలకవర్గం సహకారం అందించారు. అధికారులు మార్గదర్శనం చేశారు. జిల్లాస్థాయి అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా ఉన్నది. ముమ్ముందు గ్రామాభివృద్ధికి మరింత కష్టపడి పని చేస్తాం. -కాటేపల్లి సిద్దమ్మ, సర్పంచ్, ఇంద్రపాలనగరం

కష్టానికి ఫలితం



పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. పాలకవర్గ సభ్యులం అధికారులతో కలిసి సమాలోచనలు చేశాం. రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. పచ్చదనం-పరిశుభ్రతకు మొదటి నుంచి ప్రాధాన్యం ఇచ్చిన మేరకు అవార్డు దక్కింది. - ఆకుల సునీతాశ్రీకాంత్, సర్పంచ్, ఎస్.లింగోటం

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీ

సాక్షి, యాదాద్రి : జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థాన్ నారాయణపురం తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస రాజు యాదగిరిగుట్టకు బదిలీ చేశారు. అక్కడ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.పల్లవికి తహసీల్దార్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. యాదగిరిగుట్ట తహసీల్దార్ రాము భూక్యాను సీసీఎల్ఏకు బదిలీ చేశారు. గుండాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.జ్యోతి కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, సెక్రటరియేట్ సూపరిండెంట్‌గా ఉన్న వి.శోభన్‌బాబును గుండాల తహసీల్దార్‌గా నియమించారు.

ఎయిమ్స్ అభివృద్ధికి ఎంతో కృషి చేశా



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్

బీబీనగర్ : బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఎయిమ్స్ 3వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన హ్యాండ్ ఆన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. గడిచిన మూడేళ్లలో క్లినిక్ ల్యాబ్ సేవలు, పరిశోధనలు, టీచింగ్ పరంగా ఎయిమ్స్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా 30 వేల కంటే ఎక్కువ క్లినికల్ ల్యాబ్ ఇన్వెస్టిగేషన్లు జరుగుతున్నట్లు చెప్పారు. బయాలజీ, జెనటిక్ రంగాల్లో ప్రాక్టీస్ విప్లవాత్మకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్ చౌహన్, ప్రజ్ఞరంగనాథన్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ దుర్గ సుకుమార్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖిలో గల విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మహిళల భద్రత, సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, హోమ్ ఆటోమిషన్, డ్రోన్‌టెక్నాలజీ, రాడార్ తదితర 238 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల సీఈఓ బోయపాటి శ్రవణ్, ప్రిన్సిపల్ డాక్టర్ దుర్గ సుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను పెంపొందించుకుంటూ తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలలన్నారు. ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు దోహదపడుతాయన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



స్వామివారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ జరిపించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో అడ్లూరు సర్పంచ్ మృతి

కోదాడరూరల్ : మండల పరిధిలోని అడ్లూరు సర్పంచ్ అంబడిపుడి స్వరాజ్యం(75) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం అస్వస్థతకు గురై మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పులిచింతల పునరావస కేంద్రమైన అడ్లూరుకు ఆయన మొదటి సర్పంచ్. ఆదివారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.

ఏఆర్ డీఎస్పీకి ఏఎస్పీగా పదోన్నతి

నల్లగొండ క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్‌కుమార్‌కు ఏఎస్పీగా శనివారం పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఆయనను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేస్తూ నార్త్ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఎస్ఐగా 1996 సంవత్సర బ్యాచ్‌కు చెందిన సురేష్‌కుమార్ ఏఆర్‌డీఎస్పీగా ఆరేళ్లుగా జిల్లా పోలీస్‌కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అపూర్వరావు ఆయనను అభినందించారు. అనంతరం ఆయనకు వీడ్కోలు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్ రావు, ఆర్ఐలు నరసింహాచారి, స్పర్జన్ రాజు, శ్రీను, హరిబాబు, సంతోష్, కృష్ణారావు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని అర్ధనగ్న ప్రదర్శన

యాదగిరిగుట్ట రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం, పునరావాసం కల్పించాలని కోరుతూ లప్పానాయక్ తండా వాసులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రిజర్వాయర్ కట్టపైన గ్రామస్తులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన దీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, బిచ్చానాయక్, తండా వాసులు పాల్గొన్నారు

ఆవుల కాపరులపై కేసు

మాడుగులపల్లి: అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ఆవుల మందలను తోలుకెళ్తున్న ముగ్గురు కాపరులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తగూడెం వద్ద ఆవుల కాపరులు కేతావత్ నర్సింహ, రమావత్ శ్రీను, నేతాల అంజయ్య రహదారిపై వందల సంఖ్యలో ఆవులను తోలుకెళ్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించి, ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేశారని కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇటీవల వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద తెల్లవారుజామున ఓ ట్రావెల్స్ బస్సు మందపైకి దూసుకెళ్లడంతో పలు ఆవులు మృత్యువాతపడ్డాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రహదారిపై ప్రమాదకరంగా పశువులను తోలుకెళ్లే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

నిలిచున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- హైవేపై మునగాల మండలం ఆకుపాముల శివారులో దుర్ఘటన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులు



ప్రమాదానికి కారణమైన లారీ

మునగాల(కోదాడ): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన 14మంది కూలీలు ఉదయం జీఎమ్మార్ సంస్థకు చెందిన ట్రాక్టర్‌లో వచ్చి ఆకుపాముల శివారులో రహదారి మధ్యలో ఉన్న పూల మొక్కల పాదులు సరిచేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీ రహదారిపై నిలిపిన జీఎమ్మార్ సంస్థ ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న రోషమ్మతో పాటు దాని పక్కనే పనిచేస్తున్న నేలమర్రి వినోద (27), తుమ్మల ధనమ్మ (60)కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ దాసుకు స్వల్ప గాయాలయ్యాయి. సమీప కూలీలు గమనించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే వినోద మృతిచెందింది. మిగిలిన ముగ్గురిని కోదాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుమ్మల ధనమ్మ ప్రాణాలు విడిచింది. రోషమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. మృతురాలు వినోదకు కుమారుడు, భర్త, ధనమ్మకు భర్త, కుమారుడు,కుమార్తె ఉన్నారు.మృతురాలు వినోద భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

ఘటనాస్థలాన్ని సందర్శించిన ఎస్పీ



వినోద (ఫైల్)

జాతీయ రహదారిపై ఆకుపాముల శివారులో జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లారీ డ్రైవర్ తప్పిదం, అజాగ్రత్త మూలంగానే ప్రమాదం జరిగిందన్నారు. ఇందుకు కారణమైన లారీ డ్రైవర్‌పై ఐపీసీ సెక్షన్ 304 పార్టు–2ప్రకారం కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట కోదాడ డీఎస్పీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, మునగాల సీఐ



ధనమ్మ(ఫైల్)

ఆంజనేయులు, మునగాల ఎస్ఐ లోకేష్ ఉన్నారు. ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఆకుపాముల గ్రామం మీదుగా మళ్లించారు. అనంతరం ట్రాక్టర్‌ను క్రేన్‌తో తొలగించి జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను, క్షతగాత్రులను స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

శోకసంద్రంలో రామాపురం

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన తుమ్మల ధనమ్మ (55), నేలమర్రి వినోద (25) శనివారం మునగాల మండలం ఆకుపాముల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు చెందిన ధనమ్మ, వినోదల మృతికి గ్రామస్తులు కంటతడి పెట్టారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలంగాణలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం



కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే లింగయ్య

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నార్కట్‌పల్లి : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, జిల్లా ఇంచార్జ్ కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. నవంబర్‌లో ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అవి ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబటం లేదా అని ప్రశ్నించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు నిధులు ఇస్తున్న కేంద్రం తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపిస్తుందని ఆరోపించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీసుకెళ్తున్న ఘనత కేసీఆర్ దేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రైతులు విద్యుత్ కోతలతో అనేక ఇబ్బందులు పడేవారిని, కాని నేడు ఆ సమస్య లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రుణ మాఫీ చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయలను మాఫీ చేసి దేశ సంపదనను కొల్లగొడుతుందని విమర్శించారు. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేసి ప్రజా స్వామ్యాన్ని మోదీ అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరే విధంగా కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన లేఖ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రైతు సమితి అధ్యక్షులు యానాల అశోక్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వాజీద్ అలీ, సర్పంచులు బద్దం వరలక్ష్మి, మాధవి, ఉపేందర్, ఎంపీటీసీ రాజిరెడ్డి, యాదయ్య, కుమారస్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లెబోయిన సైదులు, ప్రమీల, సైదులు, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

యాదగిరిగుట్ట రూరల్: రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి రైల్వే ట్రాక్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బి.దశరథమ్ (44) సిగ్నల్, టెలికమ్ డిపార్ట్‌మెంట్‌లో ఈఎస్ఎమ్ గ్రేడ్–1 ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగానే వంగపల్లి పరిధిలోని రైల్వే ట్రాక్ పక్కన సిగ్నల్స్‌కు సంబంధించిన మిషన్ పాయింట్ బాక్స్ 106 బి వద్ద మిషన్లను తనిఖీ చేస్తున్నాడు. ఈ సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..

భువనగిరి : రైలు ఢీకొని మహిళ మృతిచెందింది. భువనగిరిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన గుమ్మడి లక్ష్మి(60) శనివారం కాలనీ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు భువనగిరి రైల్వే స్టేషన్ చివరి ప్లాట్ ఫాం సమీపం నుంచి రైల్వే ట్రాక్ దాటుతుండా సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురు ప్రయాణికులకు గాయాలు

చౌటుప్పల్ : రోడ్డు వెంట ఆగివున్న డీసీఎం వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లక్కారం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు వెళ్తుంది. ఆ క్రమంలో మధ్యాహ్నం సమయంలో వర్షం కురుస్తుండడంతో లక్కారం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఓ డీసీఎం డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. అదే సమయంలో వచ్చిన లగ్జరీ బస్సు డ్రైవర్ తన ముందున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో విజయవాడ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన ప్రయాణికులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స తీసుకొని వెళ్లారు.



డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు

లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవిస్తా
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బొమ్మలరామారం : లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ విషయమై సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో శనివారం కల్నల్ వినయ్ భానురెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వినయ్ కుటుంబానికి హైదరాబాద్‌లో 500 గజాల ఇంటి స్థలంతో పాటు భార్య స్పందనారెడ్డికి ఐఏఎస్ అధికారిగా అవకాశం కల్పించాలన్నారు. వినయ్ స్వగ్రామంలో తన సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య ఉన్నారు.





లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి, విప్ సునీత

కల్నల్ కుటుంబానికి ప్రభుత్వం అండ : విప్

లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కల్నల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. దేశ రక్షణ రంగంలో విశిష్ట సేవలను అందిస్తు వీర మరణం పొందిన కల్నల్ వినయ్ భాను రెడ్డి మృతి తీరనిదన్నారు. అలాగే జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సైతం కల్నల్ వినయ్ భాను రెడ్డి కుటుంబాన్ని పరమార్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్ రెడ్డి, పోలగాని వెంకటేష్ గౌడ్, గూదే బాల్ నర్సింహ తదితరులు ఉన్నారు.

'యాదాద్రి' సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణశర్మపై ఈఓ గీతారెడ్డి సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలయ వర్గాల ద్వారా ఆలస్యంగా తెలిసింది. తరచు తన విధులకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈఓ గీతారెడ్డి నాలుగు రోజుల క్రితమే సస్పెండ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈవో కార్యాలయ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా సత్యనారాయణశర్మ విధులకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈవో పలుమార్లు హెచ్చరించినా తీరు మారకపోవడంపై సస్పెండ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

శివాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి (శివాలయం)లో శ్రీసీతారామచంద్రస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నిత్యారాధనల అనంతరం ఆలయ అర్చకులు శ్రీసీతారామచంద్రస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసీతారామ హనుమత్ మూలమంత్ర జపములు, దశశాంతి పంచసూక్త పారాయణములతో అభిషేకం, ఆధ్యాత్మ రామాయణ పారాయణం, అష్టోత్తర శత నామార్చన వంటి పూజను జరిపించారు. రాత్రి 7గంటల నుంచి శ్రీసీతారామ హనుమాన్ మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన, నీరాజన, మంత్రపుష్పములు నిర్వహించి, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.



స్వామివారికి హారతినిస్తున్న ఆచార్యులు

స్వామివారిని దర్శించుకున్న ఐపీఎస్ అధికారులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కేరళ, ఢిల్లీకి చెందిన పీజీపీ (ఐపీఎస్)లు సుదర్శన్, ప్రశాంత్ కానీ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారి రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు.

నశీంపేటలో విషాదఛాయలు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : నిశ్చితార్థం జరగాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆత్మకూర్ (ఎస్) మండలం నసీంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ముల్కపల్లి మధు (30) సూర్యాపేటలోని రియలన్స్ డిజిటల్ షోరూంలో సెల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కాగా, మధు అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెద్దల అంగీకారంతో నేడు వివాహానికి శుభ ముహూర్తం నిర్ణయించుకునేందుకు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని వస్తూ మార్గమధ్య రోళ్లబండతండా వద్ద రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన మధు తిరిగి వస్తున్న క్రమంలో కారు మృత్యువు రూపంలో కబళించడంతో శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లవారితే లగ్నపత్రిక రాయాల్సిన ఇంట బంధు, మిత్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. శనివారం సాయంత్రం మధు అంత్యక్రియలు నిర్వహించారు.



మధు అంత్యక్రియలకు హాజరైన జనం

గ్రాసం కోసం పశువుల వలస



పెద్దవూరలో ప్రధాన రహదారిపై గుంపులుగా వెళ్తున్న పశువులు

పెద్దవూర: నల్లగొండ జిల్లా చందంపేట, నేరెడుగొమ్ము మండలాలకు చెందిన రైతులు తమ పశువులను మేత కోసం ఇతర ప్రాంతాలకు తోలుకెళ్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభం కావడంతో అడవులు ఎండిపోయి పశుగ్రాసం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పశువులు ఉన్న ఐదాగురు రైతులు కొందరిని కూలీలను ఏర్పాటు చేసుకుని పశువులను ఆయకట్టు ప్రాంతాలకు తోలుకెళ్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు సైతం పశువులను మేపటానికి తోలుకెళ్తారు. పశువులను మేపుకుంటూ వెళ్లి, ఐదారు నెలల పాటు ఆయకట్టు ప్రాంతాలలో మేపుకుని తిరిగి వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి తమ స్వగ్రామాలకు వెళ్తుంటారు. పది రోజుల క్రితం పశువులతో కాపరులు తమ స్వగ్రామాల నుంచి బయలు దేరారు. శనివారం పెద్దవూరలో జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారిపై వందలాదిగా పశువులు ఒకేసారి వెళ్తుండడం కనిపించింది.

పొర్లుదండాలతో యాదాద్రీశుడి చెంతకు

యాదగిరిగుట్ట : వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని, కేసీఆర్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామానికి చెందిన నాగయ్యస్వామి 21 కిలో మీటర్లు పొర్లుదండాలతో శనివారం యాదాద్రీశుడి చెంతకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వచ్చేలా దీవించాలని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకుంటూ ధనసిరి గ్రామం నుంచి 210 కిలో మీటర్లు బీఆర్ఎస్ నాయకులతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి బీబీనగర్ నుంచి 21 కిలో మీటర్ల దూరం పొర్లు దండాలతో యాదాద్రి వైకుంఠద్వారం వద్దకు చేరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట అశోక్, దశరథ, బక్కారెడ్డి, పిరప్ప, రాజ్‌కుమార్, రాజు, మల్లప్ప తదితరులు ఉన్నారు.



పొర్లుదండాలతో యాదగిరిగుట్టకు చేరుకున్న నాగయ్యస్వామి

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

శాలిగౌరారం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చొల్లగూడెం గ్రామానికి చెందిన బొల్లగోని నాగయ్య (74) కొన్ని నెలలుగా తల, ఒంటినొప్పులతో బాధ పడుతున్నాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంత సమయం తర్వాత ఇంటికి వచ్చిన కుటింబికులు నాగయ్య అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే ఆటోలో నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నాగయ్య పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనమేరకు నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని మనుమడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

పాలకవీడు: వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. పాలకవీడు, తిరుమలగిరి మండలాల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలంలోని బెట్టెతండాకు చెందిన లావుడ్య రమేష్, వెన్నెలకు 2017లో వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు. ఈ నెల 14వ తేదీన భర్త రమేష్‌తో గొడవపడి కుమారుడు విజయ్(18 నెలలు)బాబుతో వెన్నెల ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కోపంతో వెళ్లిందికదా తిరిగి వస్తుందిలే అనుకున్నారు. రోజులు గడుస్తున్నకొద్దీ భర్త రమేష్ వెతకడం ప్రారంభించాడు. ఆచూకీ కోసం తెలిసిన బంధువులందరికీ ఫోన్ చేసి సంప్రదించాడు. ఫలితం లేకపోవడంతో రమేష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపాడు.

కొంపల్లిలో ..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని కొంపల్లి కి చెందిన బెజిలి మహేశ్వరీ ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రానికి కూడా తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం మహేశ్వరీ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ బాబు తెలిపారు.